ప్రజాశక్తి

శనివారం 18 ఫిబ్రవరి 2023 | 5 | అనంతపురం



కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం మొదటి రోజు పట్టభద్రుల నియోజకవర్గానికి ఒకటి, ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలు అయ్యింది.కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు శుక్రవారం నాడు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి గాను ఇండిపెండెంట్ అభ్యర్థులుగా టి.మల్లేష్ యాదవ్, వంకిరి రామచంద్రుడు, నాగస్వరం నరసింహం, పట్టు పోగుల పవన్ కుమార్, సల్కాపురం అమత్ కుమార్‌లు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

హద్దుమీరిన 'ప్రతాప'ం





◆ ఎక్కడ ఎన్నికలున్నా అక్కడ ఇన్‌ఛార్జి

◆ అధికార మెప్పుకోసం ఆరాటం

◆ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ సీటు కొసమేనా ?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక అధికారులు అందుకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంలో ఎటువంటి అభ్యంతరాలేవీ ఉండవు. కాని అలా కాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మద్దతుగా అధికారిక హోదాలో ఉన్న వారు వ్యవహరించ కూడదు. కాని విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి మాత్రం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ఎక్కడ జరిగితే అక్కడ ఇన్‌ఛార్జిగా వెళ్లటం అక్కడ అధికార పార్టీ మెప్పుకోసం తన 'ప్రతాప'ం చూపడం పరిపాటిగా మారుతూనే ఉంది. గతంలోనూ గుంటూరు-కృష్ణా జిల్లాలో ఎన్నికలు జరిగినప్పుడు ఆయన భార్య కల్పలతారెడ్డి ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఇన్‌ఛార్జిగా వెళ్లి ఓటర్లను ప్రభావితం చేసారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు కూడా అదే తంతు అనంతపురం, కడప, కర్నూలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కన్పిస్తోంది.

మాట వినేవారినే నియమించి..

సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ శాసనమండలి ఎన్నికలను రాజకీయపార్టీలు ఎన్నికల రెఫరెండమ్‌గా భావిస్తున్నాయి. గత శాసనమండలి ఎన్నికల ఫలితాలను అదే రకంగా తీసుకున్నాయి. ఆ ఫలితాలు ఇప్పటి అధికార వైసిపికి అనుకూలంగా రావడం, ఆ తరువాత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపినే అధికారంలోకి వచ్చింది. ఇది చూసిన పార్టీలు ఈ ఎన్నికలు ప్రజల మూడ్‌ను తెలియజేసేవిగా భావిస్తుంటాయి. అందుకే మండలి ఎన్నికలను రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి ఈ ఎన్నికలను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు కనిపిస్తోంది. తమకున్న సర్వశక్తులనూ ఒడ్డేందుకు సిద్ధపడింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తీసుకుంటున్న చర్యలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఓటర్ల నమోదు సమయంలో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించలేదని అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను బదిలీ చేశారు. ఆ తరువాత ఆర్జేడీ వెంకటప్రసాద్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. తరువాత ఆయన్ను తప్పించి గుంటూరు-కృష్ణ ఎన్నికల్లో తమకు అనుకూలంగా బాగా పనిచేసారని భావించిన ప్రతాప్‌రెడ్డి ఎస్‌పిసిఆర్ అడిషనల్ డైరెక్టర్‌గానున్న ఆయన్ను ఆర్జేడీ ఇన్‌ఛార్జిగా తీసుకొచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచే మూడు జిల్లాల్లో సొంత శాఖ పనుల కంటే ఎన్నికల పనులపైనే ఎక్కువగా దృష్టి సారించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక సమావేశాల్లోనూ ఆయన వ్యవహార శైలి అధికారపార్టీకి ప్రచారం చేసే విధంగా సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. అది గురువారం అనంతపురం నగరంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలోనూ కనిపించింది. ఇక రాత్రికి స్వచ్ఛంద సంస్థ అతిథి గృహంలో వైసిపి ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డితోపాటు, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలతో కలిపి సమావేశం నిర్వహించడం, ఆ సమావేశంలోనే విందు, మందు కూడా ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. విద్యార్థి సంఘాల ఆందోళనతో వెలుగులోకి వచ్చాక కూడా ఏకంగా పోలీసు అధికారినే బెదిరించడం ఆయన అధికార దర్పానికి అద్దం పడుతోంది.

ప్రతాప్‌రెడ్డిలో రాజకీయ వాసనలు

ఆర్జేడీగానున్న ప్రతాప్‌రెడ్డిలో రాజకీయ వాసనలున్నట్టు విద్యార్థి, యువజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ఎన్నికల్లోనే వైసిపి తరుపున తమ కుటుంబ సభ్యులకు కదిరి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించినట్టు రాజకీయవర్గాల్లోనూ చర్చ సాగుతోంది. ఇప్పుడు కూడా వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంటుగానీ, కదిరి అసెంబ్లీ నుంచిగాని తమ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరికి టికెట్టు ఆశిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ ఎన్నికల్లో పార్టీ పెద్దల మెప్పుకోసం బాహాటంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

జిల్లా వాప్తంగా 39 బృందాలు ఏర్పాటు

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు పక్కాగా చేపట్టాలని ఇందుకోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 9వ తేదీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన రోజు నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీవోల నేతత్వంలో మండలానికొక బృందం ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీలతో కలుపుకుని జిల్లాలో మొత్తం 39 టీములు నిరంతరం కోడ్ అమలును పర్యవేక్షిస్తున్నాయన్నారు. ఇవిగాక అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు నియమించామన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎన్నికకు 84 కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 33 కేంద్రాలు, స్థానిక సంస్థల ఎన్నికకు 3 కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక విధానంలో జరిగే ఎన్నికలలో ఓటు వేసే విషయంపై అవాగహన కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుకు పరిమితి లేదని, అయితే ప్రతి అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు అకౌంటు తెరవాల్సి ఉంటుందన్నారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో వైద్యాధికారి ఎస్‌ఎమ్‌డి షఫీ

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఆయుర్వేద వైద్యాధికారి ఎస్‌ఎమ్‌డి షఫీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని ఉరవకొండ ఆయుర్వేద వైద్యాధికారి ఎస్‌ఎమ్‌డి షఫీ పేర్కొన్నారు. శుక్రవారం ఉరవకొండ పట్టణ శివారులో ఉన్న అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 420 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్‌ఎమ్‌డి షఫీ మాట్లాడుతూ.. జ్ఞానము వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, ఆనందం కలుగుతాయన్నారు. విద్యార్థులు వేకువజామునే లేచి యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయుట ద్వారా మానసిక దృఢత్వం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరిగి బాగా చదువుకొనుటకు ఎక్కువగా అవకాశం ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయుట ద్వారా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండవచ్చన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ పచ్చని చెట్లు పెంచాలని సూచించారు. మంచి వాతావరణంలో యోగా, ఆటలు విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యం ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అవిసె గింజలు, పాలు, గుడ్లు వంటి పౌష్టిక ఆహార పదార్థాలు భుజించాలన్నారు. ముఖ్యంగా నివాసాలు, పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ కార్యాలయాలు అవకాశం ఉన్నచోట్ల వేప, తులసి, సరస్వతి, తిప్పతీగ, కానుగ, రావి వంటి వాతావరణ కాలుష్యాన్ని నివారించే చెట్లను నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భారతి, స్టాఫ్‌నర్స్ సంధ్య, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడు మృతి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ 2వ సర్కిల్లో పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న నాగభూషణం అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. అనారోగ్యంతో ఆయన మూడు రోజుల క్రితం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. నాగభూషణం మృతికి నగరపాలక సంస్థ కార్మికులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షులు సాధు కుల్లాయిస్వామి

ఉరవకొండ టౌన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివృద్ధికి పాలకవర్గం సమన్వయంతో కృషి చేస్తున్నట్లు బ్యాంక్ అధ్యక్షులు సాధు కుల్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చంగల మహేష్ తెలిపారు. శుక్రవారం బ్యాంకు పాత భవనంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో కొత్త సభ్యులను చేర్చుకునేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఒక్కొక్కరి షేర్ విలువ రూ.300గా నిర్ణయించారు. ఐదు షేర్స్ తక్కువ కాకుండా సభ్యత్వం తీసుకోవాలని పాలకవర్గం తీర్మానించింది. బ్యాంకును అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు పలకవర్గం సభ్యులు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో కరణం వేదమూర్తి, డైరెక్టర్లు వెంకటస్వామి, నాగరాజు, పెద్దకోట్ల శ్రీనివాసులు, మైనుద్దీన్, ఇంతియాజ్ బాషా, గిద్దలూరు వెంకటేశులు, ప్రవీణ్ కుమార్, పెద్దకోట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి మండలం కృష్ణాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎంపిపి కమల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, దేశంలోనే మేధావి వర్గంలో ఒకరై అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కుల నిర్మూలనే ధ్యేయంగా పనిచేసిన అంబేద్కర్ విగ్రహాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యనమలదొడ్డి సర్పంచి తనయుడు విజయ్‌కుమార్, ఆలూరు నరేష్, ఎమ్మార్పీఎస్ కుందుర్పి మండల అధ్యక్షులు కృష్ణాపురం బాబు, తూముకుంట గంగాధర్, ఎన్.తిమ్మరాజు, మాజీ జెడ్పిటిసి రాజగోపాల్, తెనగల్లు మాజీ సర్పంచి లింగప్ప, కరిగానపల్లి మాజీ సర్పంచి తిప్పేస్వామి, డీలర్ తిమ్మప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగం

◆ ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించాలి ◆ సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకోసం విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతున్న ఈయన్ను తక్షణం విధుల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక గణేనాయక్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికారిగా కాకుండా అధికార పార్టీ ఎన్నికల ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాత్రి సమయంలో ప్రయివేటు అతిథి గృహాల్లో వైసిపి ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి సమక్షంలోనే ఉపాధ్యాయ సంఘాలు, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలను పిలుచుకుని ఎన్నికల్లో ఎరవేసే ప్రయత్నాలు చేసారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన విద్యార్థి సంఘం, యువజన సంఘం నాయకులపై బెదిరింపులకు దిగారని పేర్కొన్నారు. ఆర్‌జెడి అక్రమాలను ప్రశ్నించిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేసి రాప్తాడు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లేలా పోలీసుపై ఒత్తిడి చేశారన్నారు. అంతటితో ఆగని ఆర్‌జెడి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఏకంగా పోలీసు అధికారిని అందరి సమక్షంలోనే బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాలన్నీ సిసి పుటేజీల్లో ఉన్నాయన్నారు. వీటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పైగా విద్యార్థి సంఘం నాయకులే ఆర్జేడీని హత్య చేయడానికి వచ్చారని బుకాయించే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. విద్యార్థి సంఘం నాయకులే మద్యం సేవించి వచ్చారని కూడా చెప్పారన్నారు. దీనిపై విచారణకు తాము సిద్ధమని, ఆర్జేడీ సిద్ధమా అని ప్రశ్నించారు. మద్యం మత్తులో కనీసం నిలబడలేని స్థితిలో ఆర్జేడీ రాత్రి ఉన్నారన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీకి పూర్తి అనుకూలంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయదలచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన ఆర్జేడీపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆ బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఇన్‌ఛార్జిగా వచ్చిన ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతు న్నారన్నారు. ఆయన తనకున్న అధికారంతో అటు ఉపాధ్యాయులను, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలపై ఒత్తిడి పెంచి అధికార వైసిపికి శాసనమండలి ఎన్నికల్లో ప్రయోజనం చేకూర్చాలని చూడటం సరైంది కాదని మండిపడ్డారు. రాత్రి సమయంలో ఒక స్వచ్ఛంద సంస్థ అతిథి గృహంలో కొంత మందిని పిలిపించుకుని విందులివ్వడమే కాకుండా, డబ్బుల పంపిణీకి ఆయనే దగ్గరుండి ప్రణాళిక చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అధికారపార్టీ అధికారుల ద్వారా అడ్డదారుల్లో పనులు చేయించుకుని ఎన్నికల్లో గెలవాలని చూడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. వామపక్షాలుగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగే విధంగా తాము కోరుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ పద్ధతులకు ఎవరైనే పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, నాగేంద్రకుమార్, సిపిఐ నాయకులు రమణయ్య పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్మికుల జనరల్ బాడీ సమావేశం సిఐటియు యూనియన్ నాయకులు ఎటిఎం నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పల నాగభూషణ, సిఐటియు ఒకటవ, రెండవ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, గురురాజా, ముర్తుజా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. ప్రతినిత్యం పట్టణాలను శుభ్రం చేస్తూ, నగరంలో ప్రజలని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం, పాలకవర్గాలు నేటికీ అంటరాని వారిగానే చూస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తోందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులను అప్‌కాస్‌లో చేర్చి వారికి సంక్షేమ పథకాలు వర్తించకుండా చేసిందన్నారు. అవుట్సోర్సింగ్ కార్మికులకు ఐడి క్రియేట్ చేసి ఆన్‌లైన్‌లో రెగ్యులర్ కార్మికులుగా చూపుతోందన్నారు. కార్మికులను వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పించన్లకు దూరం చేసిందన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. అద్దె ఇళ్లలో 6 నుండి 8 మంది వరకు జీవనం సాగిస్తున్నారన్నారు. కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సింది పోయి, ప్రజా ప్రతినిధులు వందల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్, ఆర్డీవో వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో మరోసారి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు బండారి ఎర్రిస్వామి, శ్రామిక మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, బి.లక్ష్మీదేవి, ఆదినారాయణ, చలపతి, నాగేంద్ర, ప్రభాకర్, కిరణ్, కృపమ్మ, లక్ష్మయ్య, పుల్లన్న, శివ, హరి, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

సిఐటియులో పలువురి చేరిక

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు, గార్బేజి కార్మికులు దాదాపు 50 మంది సిఐటియు సంఘంలో శుక్రవారం చేరారు. వారికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, మాజీ జిల్లా కార్యదర్శి రాంగోపాల్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, సిఐటియు ఒకటవ, రెండవ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, గురురాజా, ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర అధ్యక్షులు బండారి ఎర్రిస్వామి, శ్రామిక మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి ఎర్ర కండువాలు కప్పి సిఐటియు సంఘంలోకి ఆహ్వానించారు. సిఐటియుతో కలిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

గవిమఠం రథోత్సవానికి ఎమ్మెల్సీకి ఆహ్వానం

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో వెలిసిన ప్రసిద్ధ గవి మఠం చంద్రమౌళీశ్వర స్వామి మహా రథోత్సవం వచ్చేనెల మార్చి 1వ తేదీన జరుగునున్న దృష్ట్యా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఆలయ అధికారులు ఆహ్వానించారు. శుక్రవారం గవి మఠం అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని ఆయనకు అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మహా రథోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల గురించి ఆమెతో చర్చించారు. హాజరయ్యే భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకొని అదనంగా చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

డైరీల ఆవిష్కరణ

శింగనమల : విద్యా సహాయకుల 2023 డైరీలను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నిర్మల కుమారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలంలోని సంక్షేమ, విద్యా సహాయకులు పాల్గొన్నారు.

పంపనూరులో శివరాత్రి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పంపనూరు గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు గణపతి పూజ, స్వస్తి వాచనము, రక్షా బంధనము, గోపూజ, ద్వారపాలక పూజ, 5:30 గంటలకు గోసహిత పూర్ణకుంభ కైలాస ద్వార ప్రవేశం, ఆలయ ప్రదక్షిణ, ఆలయ ప్రవేశం ఉంటుందన్నారు. మంజునాథస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6:00 గంటలకు గౌరి సమేత మంజునాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. యమ పూజల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9 గంటలకు, అర్ధరాత్రి 12 గంటలకు, ఆదివారం ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకాలు జరిపిస్తామని చెప్పారు. అర్ధరాత్రి లింగోద్భావ సమయంలో 39 మంది బ్రహ్మణులచే శతరుద్రం చేస్తామని తెలిపారు. జాగరణలో భాగంగా రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రూ. 20 వేలు విరాళం

శింగనమల : శింగనమల మండల కేంద్రం చిన్నకాలవ వీధిలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించు అన్నదాన కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లిదాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుల్లాయప్ప, ఆదినారాయణ, బీసీసెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, బీసీసెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, కాయల సురేష్ యాదవ్, నార్పల మండల నాయకులు, రంగాపురం శ్రీరాములు, శివరామకృష్ణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద అన్నదానం

గుత్తి : పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద శివమాలాదారుల ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ మాసాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద శివమలాదారులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఆలయ అర్చకులు, గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గతంలో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కౌన్సిలర్ దాసరి పుష్పలత, వైసీపీ నాయకుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం పరిసర ప్రాంతాల్లో ఈ నెల 19వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. శుక్రవారం పోలీసులు, జెఎన్టీయు ప్రిన్సిపల్ సుజాత, అధికారులతో కలిసి ఎస్పీ స్థానిక అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రం, స్ట్రాంగు రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షలు ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు జరుగనున్నాయని చెప్పారు. అనంతపురం నగరం, పరిసర ప్రాంతాల్లో 20 పరీక్ష కేంద్రాలలో మొత్తం 13,423 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇందుకు గాను ఐదు రూట్లుగా విభజించి బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో రూటుకు డీఎస్పీ ఇన్‌ఛార్జిగా ఉంటారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద సిఐ లేదా ఎస్ఐ బందోబస్తు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, అదనంగా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే అనుమతిస్తామన్నారు. ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతించబోమని తెలిపారు. మొబైల్స్, ఇతర డిజిటల్ పరికరాలు అనుమతించబోమన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. దళారులు ఎవరైనా ఆశ్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీతో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, వన్‌టౌన్ సిఐ రవిశంకర్ రెడ్డి, అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి ఫక్కీరప్ప

శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కడపలో ఈనెల 16వ తేదీన స్టూడెంట్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ బాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-17, అండర్-14 విభాగాల్లో స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య సి అండ్ ఎం డేస్కాలర్ క్యాంపస్ విద్యార్థులు విజయభేరి మోగించారు. తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో విజయం సాధించినట్లు ప్రిన్సిపల్ విశ్వనాథ్ తెలిపారు. బాడ్మింటన్ అండర్-17 విభాగంలో 9వ తరగతికి చెందిన శివవర్ధన్ మొదటి బహుమతి, సాయి హర్షిత్ రెండో బహుమతి, సాయి చరణ్ మూడోవ బహుమతిని, చెస్ అండర్-14 విభాగంలో 8వ తరగతికి చెందిన సంజయ్ రామస్వామి రెండో బహుమతి, కిరిటీ 3వ బహుమతి, చెస్ అండర్-17 విభాగంలో 8వతరగతి విద్యార్థి చరణ్ 3వ బహుమతిని కైవసం చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినంద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ విద్యార్థులు మార్చిలో ఆగ్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకి ఎంపికయ్యారని తెలియజేశారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, సిరాజుద్దీన్, పిఇటి రవిరాజ్, సింధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు ఇచ్చి కుటుంబాలను బతికించండి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ఉరవకొండ

బకాయి వేతనాలు చెల్లించి తమ కుటుంబాలను బతికించాలని సత్యసాయి వాటర్ సప్లై సంఘం అధ్యక్షులు బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు పంప్ హౌస్ ఎదుట కార్మికుల ఆధ్వర్యంలో 17వ రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెలలో సమ్మె చేసినప్పుడు ఎస్ఈ, డీఈ లు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రాడ్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ మొదలగు వాటిని వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు, కాంట్రాక్టర్లకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే సిఐటియు పిలుపుమేరకు సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మల్లన్న, సైనా నాయక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

ఆర్డీవో కె.రవీంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూ శాశ్వత హక్కు, భూ రక్ష పథకం భూమి సమస్యలను పరిష్కారం చేసేందుకే అని, రైతులు, ప్రజలు రెవెన్యూ సిబ్బందికి సహకారాన్ని అందించాలని ఆర్డీవో కె. రవీంద్ర అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కొనకొండ్ల రోడ్డులోని భీమ రెడ్డి పార్క్ వద్ద మున్సిపాలిటీ స్థలాల రీసర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో రవీంద్ర లాంఛనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ సర్వే 1929లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆనాటి రికార్డులు ఆధారంగానే ప్రస్తుతం రికార్డులు అమల్లో ఉన్నాయన్నారు. అయితే ఆ కారణంగా భూ వివాదాలు కేసులు కోర్టుల్లో పేరుకుపోయాయన్నారు. ఆ భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూహక్కు భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టి ఆత్యాధునిక టెక్నాలజీ ద్వారా డ్రోన్ల సహకారంతో భూ రీ సర్వే చేపట్టిందన్నారు. డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లోనూ మున్సిపాలిటీల పరిధిలో భూ రీ సర్వే ప్రారంభించామన్నారు. రైతులు ప్రజలు సిబ్బందికి సహకరిస్తే వారి భూములకు సంబంధించిన హద్దులను రెవెన్యూ సిబ్బంది ఏర్పాటుచేసి భూ హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బి.రాము, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కెఎమ్‌డి.ఇసాక్, భూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

గృహ సారథులే జగనన్న విజయసారథులు

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి
మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, పరిశీలికులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

నేటి గృహ సారథులే రేపటి జగనన్న విజయ సారథులని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించే బాధ్యత వారిదే అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులు, జెడ్పి ఛైర్ పర్సన్ గిరిజమ్మ అన్నారు. బెలుగుప్పలో జెసిఎస్ మండల కన్వీనర్ దుద్దేకుంట రామాంజనేయులు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోకేష్ పాదయాత్రను ప్రజలు పట్టించుకోవడమే మానేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన వల్లే ప్రజలు.. ప్రతిపక్షాలకు మద్దతు ఇవ్వడం లేదని చెప్పారు. మనం మరింత కష్టించి పనిచేస్తే జగన్మోహన్ రెడ్డి చెబుతున్న 175 స్థానాల లక్ష్యానికి చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, ఎంపీపీ పెద్దన్న వైసీపీ మండల కన్వీనర్ పి.శ్రీనివాసులు, త్రిలోక్‌నాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పావతి, సింగిల్ విండో అధ్యక్షుడు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, సర్పంచులు, వాలంటరీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న భక్తులకు అన్నదానం

12 ఏళ్లుగా దుర్గంవాసుల ఔదార్యం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

శివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు అడవి మార్గంలో కాలినడకన వచ్చే భక్తుల ఆకలి తీర్చాలని చేసిన ప్రయత్నానికి ఈ ఏడాదితో పుష్కరకాలం (12 ఏళ్లు) పూర్తయింది. రాయదుర్గం పట్టణానికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఆర్‌టి.కాంతారెడ్డి చేస్తున్న సంకల్పానికి మిత్ర బృందం సహాయ సహకారాలు అందిస్తూ వేలాది మందికి అన్నదానం చేయగలుగుతున్నారు. శివ భక్తులకు మేమున్నామనే విధంగా మూడు రోజులపాటు నిరంతరాయంగా అన్నదానం చేశారు. దుర్గంవాసుల ఔదార్యాన్ని ఇతర ప్రాంతాలవారు కొనియాడేలా చేసింది. తొలినాళ్లలో పండ్లు పంపిణీ చేసిన రోజుల నుండి క్రమంగా వేలాదిమంది శివ భక్తులకు ఆకలి తీర్చే మహా సంకల్పంగా మారింది. రాయదుర్గం నుండి సరుకుల వాహనంతో మిత్రబృందం శివరాత్రికి నాలుగు రోజుల ముందుగానే శ్రీశైలంలోని హటకేశ్వరంకు చేరుకుంటారు. వేలాది మందికి మూడు రోజులపాటు వేళకు తగ్గట్టుగా వంటకాలు సిద్ధం చేసి నిరంతరం అన్నదానం చేస్తారు. బుధవారం, గురువారం, శుక్రవారం (మూడు రోజుల్లో) సుమారు 25 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేసినట్లు కాంతారెడ్డి తెలిపారు. శివరాత్రి సందర్భంగా దూరప్రాంతాల నుండి కాలినడకన వచ్చే భక్తుల ఆకలి, దప్పిక తీర్చడంలో తృప్తి కలుగుతుందన్నారు. మిత్ర బృందం సభ్యులు రాయదుర్గం జెడ్‌పిటిసి మల్లికార్జున, మధుసూదన్ రెడ్డి, మేడా నాగభూషణం, కుమార్, వెంకటేశులు, హనుమేష్, ప్రసాద్, అంజి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కాంతారెడ్డి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజుకు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగ, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగ, ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు ఆయా సంఘాల నేతలు ప్రకటించారు. శుక్రవారం నాడు అనంతపురం జిల్లా కేంద్రంలోని మాసినేని హోటల్ నందు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుతో కలిసి ఆయా సంఘాల నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బహుజన యువ నాయకులు పుంగనూరు రామచంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనుల శ్రేయస్సు కోసం పాటుపడే నాయకుడు పోతుల నాగరాజు అన్నారు. బహుజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజలు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపుకు కషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మద్దతు తెలిపిన సంఘాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ శేషు పణి, ఆర్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, మైనార్టీ ఉద్యోగుల ఐక్య వేదిక న్వీనర్ పర్వీష్, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతా చంద్ర మోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విజయ భాస్కర్, రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వేమయ్య యాదవ్, కురుబ సంఘం యువత రాష్ట్ర అధ్యక్షులు విఠల్ గౌడ్, ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఆర్.నారాయణ నాయక్, సాగర సంగం రాష్ట్ర యువత అధ్యక్షులు పవన్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, హెచ్‌ఆర్‌సిసిఐ రాష్ట్ర డిప్యూటీ ఛైర్మన్ ఎం.నారాయణస్వామి, జె.రామన్న, ఏపీ ఎన్జీవో టౌన్ కార్యదర్శి శ్రీధర్‌బాబు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రామకష్ణ, మేవా జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, బిటిఏ జిల్లా అధ్యక్షులు ఎం.ఓబులేసు, ఉమా శంకర్, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, సంగం జిల్లా అధ్యక్షులు జిట్టా రామ్మోహన్ యాదవ్, ఎస్కేయూ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు జైపాల్ యాదవ్ తదితర సంఘాలు నాయకులు హాజరై మద్దతు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

రూ.2 వేలు జరిమానా

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలో గోపురాసపల్లె గ్రామంలో ఏడాది క్రితం జరిగిన పోక్సో కేసులో ఒకరికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమాన విధిస్తూ అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి టి.రాజ్యలక్ష్మి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఈ ఘటనపై పుట్లూరు పోలీసుస్టేషన్లో 15-02-2022 తేదీన కేసు నమోదు చేశారు. సిఐ మల్లికార్జున గుప్తా దర్యాప్తు చేపట్టి ఛార్జిషీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును సమగ్రంగా విచారించిన జడ్జి నిందితుడు రాజగోపాల్‌రెడ్డికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారిని, ప్రాసిక్యూషన్ తరపున వాదించిన స్పెషల్ పిపి విద్యాపతి లను, కోర్టు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్యను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి-తాడిపత్రి రైల్వే మార్గం మధ్య రాయలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వృద్ధుడు రైలు కిందపడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం పెద్ద పేట గ్రామానికి చెందిన బొంపల్లె ఈరన్న (76) అనే వృద్ధుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధను భరించలేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓబిగానిపల్లిలో చోరీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కంబదూరు మండల పరిధిలోని ఓబిగానల్లి గ్రామంలో గురువారం రాత్రి గొల్ల ఆనందమ్మ, హరిజన బంగారు రామాంజి, మాల జ్యోతి, పెయింటర్ వెంకటేశులు, తండషేక్‌రాం తదితరుల ఇళ్లలో చోరీ జరిగింది. ఏకకాలంలో తాలాలు వేసిన ఇళ్లలోకి దొంగలు చొరబడి డబ్బు, బంగారు, నగలు ఎత్తికెళ్లినట్లు బాధితులు తెపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆత్మకూరు మండల పరిధిలోని సింగనగుట్ట వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న భార్యా భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విలేకరులు వివరాల కోసం పలుమార్లు పోలీసులను సంప్రదించినా స్పందిచకపోవడం గమనార్హం.

19న విమలాశాంతి కథాసాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

అనంపురం నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఈ నెల 19వ తేదీ ఆదివారం రాయలసీమ యువ కథాకిరణం కెవి.మేఘనాథ్‌రెడ్డికి విమలాశాంతి కథాసాహిత్య ప్రత్యేక పురస్కారం అందజేయనున్నట్లు ప్రముఖ కవి శాంతినారాయణ తెలిపారు. ఒక యువ కథకుణ్ణి, మన రాయలసీమ కథాసాహిత్యంలోకి దూసుకొస్తున్న సరికొత్త కాంతికిరణాన్ని ఆశీశ్శకరాలతో అభినందించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను స్నేహాభినందన పరిమళాలతో నింపి దిగ్విజయం చేయాలని కోరారు.

ఉపాధి పనుల దొంగలను గుర్తించండి

అధికారులను కోరిన జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు

ప్రజాశక్తి-నార్పల

ఉపాధి పనులు చేయకుండానే బిల్లులు కాజేస్తున్న దొంగలను గుర్తించాలని, కూలీల వివరాలు అందజేస్తే దొంగలను తామే గుర్తిస్తామని జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. అర్హులైన కూలీలకు బిల్లులు ఇవ్వడంలేదని, పనులు చేయని వారికి బిల్లులు మంజూరు చేస్తున్నారని జెడ్‌పిటిసి నాగరత్నమ్మ, ఎంపిటిసి రమాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, బిల్లులు రికవరీ చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖల్లో జరిగిన ప్రగతి గురించి వివరించారు. మండలంలో వివిధ సమస్యలపై చర్చించారు. సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, ఎంపిటిసి సభ్యులు శంకర్, వెంకటనారాయణమ్మ, పద్మాకర్‌రెడ్డి, పప్పూరు సహకార సంఘం అధ్యక్షుడు పెద్దన్న, వెంకటరమణమ్మ, కాటమయ్య, రమాదేవి, వ్యవసాయ శాఖ అధికారి ముస్తఫా, వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులు, హౌసింగ్ ఏఈ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కంబదూరు మండల కేంద్రంలో వెలసిన చెల్లమల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దవడుగూరు మండలంలోని శైవక్షేత్రాలు రంగు రంగుల విద్యుత్తు దీపాలతో ముస్తాబు అయ్యాయి. పెద్దవడుగూరు మండల కేంద్రంలోని పేట శివాలయం, చిన్నవడుగూరులోని సిద్దేశ్వరస్వామి, కాశేపల్లిలో మల్లికార్జునస్వామి, చింతలచెరువులోని జోడిలింగేశ్వరస్వామి, రాంపురంలోని శివాలయం, లక్షుంపల్లి, మిడుతూరు, దిమ్మగుడి, కొట్టాలపల్లి, ఆవులాంపల్లి, మేడిమాకులపల్లి తదితర గ్రామా శివాలయాల్లో శని, ఆదివారాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, నిర్వాహకులు తెలిపారు. చిన్నవడుగూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏటా శివరాత్రి వేడుకలకు ప్రత్యేకత ఉంటుంది. ఇక్కడ నిర్వహించే పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హజరవుతారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చెక్కభజన పోటీలను తిలకిచేందుకు అధిక సంఖ్యలో తరలివస్తారు. వచ్చిన వారికి అన్నదాన సదుపాయం కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నద్ధం అయ్యారు.

పుట్లూరు : మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శివరాత్రి సందర్భంగా పుట్లూరు, కడవకల్లు, వెల్లుట్ల, గూడూరు, మడ్డిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు రాత్రి జాగారం చేసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బొమ్మనహాల్ : శివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. బొమ్మనహాల్, గోనేహాల్, ఉద్దేహాల్, నేమకల్, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శింగనమల : చిన్నజలాలపురం గ్రామంలోని కొండమీద రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడులకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుబ్బరంగయ్య స్వామి తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.